# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-08-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అద్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈ రోజు సమావేశమైంది.**

2. **రాష్ట్రంలో రాయితీపై విద్యుత్ సైకిళ్లను అందించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

3. **రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెరగకుండా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.**

4. **లఖ్ పతీ దీదీ కార్యక్రమం ద్వారా మహిళలు ఆదాయం పొందేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు**

5. **రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేసేందుకు సభ్యత నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి, భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు.**

==============================

రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అద్యక్షతన ఈ రోజు రాష్ట్ర మంత్రివర్గం సమావేశమైంది. కాగిత రహితంగా ఆన్ లైన్ విధానం ద్వారా ఈ-క్యాబినెట్ సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. గత ప్రభుత్వం తీసుకొచ్చిన రివర్స్ టెండరింగ్ విధానాన్ని మంత్రివర్గం రద్దు చేసింది. పాత విధానంలోనే టెండర్లు పిలిచే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. అలాగే స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో -ఎస్ఈబీ రద్దు, పట్టాదారు పాసు పుస్తకాలపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఫొటో తొలగింపు, సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ, పోలవరం ఎడమ కాలువ పనుల పునరుద్ధరణకు రాష్ట్రంలో వివాదాల్లో ఉన్న భూముల రిజిస్ట్రేషన్ నిలిపివేతకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఇలా ఉండగా మంత్రి వర్గ సమావేశం అనంతరం తర్వాత ముఖ్యమంత్రి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖపై సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎంఈల ఏర్పాటు కోసం కొత్త విధానం, పారిశ్రామిక వాడల ఏర్పాటుపై ముఖ్యమంత్రి అధికారులతో చర్చించనున్నారు.

-------------------------

రాష్ట్రంలో స్వయం సహాయక సంఘ మహిళలు, విద్యార్థులకు రాయితీపై విద్యుత్ సైకిళ్లను అందించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇంధన

సామర్థ్య కార్యక్రమాల అమలుపై ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంధన సామర్థ్య కార్యక్రమాలకు ప్రాధాన్యత కల్పించనున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని ఉత్తమ ఇంధన సామర్థ్య కేంద్రంగా తీర్చిదిద్దుతామని, ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో భాగంగా నిర్మించిన గృహాల ఇంధన సామర్థ్య విద్యుత్ ఉపకరణాలను రాయితీపై అందిస్తామన్నారు. ప్రభుత్వ ఆర్టీసీలో విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టనున్నామని, ప్రభుత్వ భవనాల్లో సౌర విద్యుత్ వినియోగించాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెరగకుండా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సంస్థల ఆర్థిక స్థితిని పటిష్ఠం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని, విద్యుత్ డిస్కంల అప్పులు తగ్గించి వాటిని బలోపేతం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. డిస్కంల రేటింగ్ మెరుగుపరిచే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

---------------------------

మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా, విక్రయాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. సృజన తెలిపారు. "నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నియంత్రణ, దుష్ప్రభావాలపై నిన్న కలెక్టర్ కార్యాలయంలో నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబుతో కలిసి కలెక్టర్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యువత భవిష్యత్తును హరించే మాదకద్రవ్యాల వినియోగాన్ని కట్టడి చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు 100 రోజుల కార్యచరణ ప్రణాళికను అమలు చేస్తూ, వాటి వినియోగం వలన ఎదురయ్యే దుష్ఫలితాలు గురించి విస్తృత ప్రచారం కల్పించనున్నామని కలెక్టర్ వివరించారు.

---------------------------

రాష్ట్రానికి చెందిన ప్రముఖ వైద్యులు పి.రఘురామ్ అరుదైన పురస్కారాన్ని సాధించారు. రఘు రామ్ కు అంతర్జాతీయ సర్జరీ సంఘంలో గౌరవ ఫెలోషిప్ కు ఎంపికయ్యారు. అవయవ మార్పిడికి సంబంధించి ఆయనకు ఈ పురస్కారం లభించింది. భారత్ నుంచి ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కుడు రఘు రామ్ విశేషం.కాగా ఈ పురస్కారాన్ని మాతృమూర్తికి, మాతృభూమికి అంకితం చేస్తున్నట్టు రఘురామ్ తెలిపారు.

---------------------------

స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను ఆన్‌లైన్ విధానంలో విక్రయించేందుకు (ఓఎన్‌డీసీ) ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ నెట్‌వర్క్‌కు అనుసంధానించాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. నిన్న రాష్ట్ర సచివాలయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని దాదాపు 90 లక్షల మంది మహిళల్లో 55 లక్షల మంది పొదుపు సంఘాల కార్యకలాపాల ద్వారా ఏడాదికి లక్ష కన్నా అధిక ఆదాయం పొందుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ లఖ్ పతీ దీదీ కార్యక్రమం ద్వారా ఎక్కువమంది పొదుపు సంఘాలకు చెందిన మహిళలు లక్షకు పైబడి ఆదాయం పొందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

---------------------------

ప్రధాన మంత్రి జన్ మాన్ కార్యక్రమం క్రింద ఆదివాసీ గిరిజనులు– పి.వి.టి.జి ల అభివృద్ధికి చర్యలు

తీసుకుంటున్నామని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జిల్లాలో ప్రధాన మంత్రి జన్ మాన్ కార్యక్రమం అమలు పై నిన్న కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పి.వి.టి.జి గిరిజనులకు పక్కా గృహాలు నిర్మించాలని, కనీస మౌలిక వసతులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రధాన మంత్రి జన్ మాన్ కార్యక్రమం క్రింద అవగాహన కార్యక్రమాలను నిర్వహించి గ్రామస్తుల అవసరాలు గుర్తించాలని సూచించారు. సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు, ఆరోగ్య కార్డులు జారీ వంటివి అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

---------------------------

రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేసేందుకు బిజెపి సదస్యత అభియాన్ 2024ను నిర్వహిస్తున్నామని కేంద్ర కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి, భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. నిన్న విజయవాడలో నిర్వహించిన పార్టీ సమావేశంలో కేంద్ర మంత్రి పాల్గొని మాట్లాడుతూ, సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా వచ్చే నెల 1 వ తేదీ నుండి బిజెపి సభ్యత్వ నమోదును నిర్వహించనున్నామని చెప్పారు. సభ్యత్వ నమోదు ద్వారా పార్టీ విధానాలను, కేంద్ర పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించనున్నామని తెలిపారు.

---------------------------

ప్రతీ ఒక్కరూ అమ్మ పేరిట ఒక మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ శ్రీకాకుళం జిల్లా క్షేత్ర ప్రచార అధికారి బి.తారక ప్రసాద్ తెలిపారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా ఆమదాలవలస మండలంలోని ముద్దాడపేట గ్రామంలో గ్రామస్తులతో కలసి మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణపై గ్రామస్తులుతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం తారక ప్రసాద్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు తల్లిపేరిట మొక్క నాటడం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ఎన్టీఆర్ జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ఎత్తిపోతల ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడుకి విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ విజ్ఞప్తి చేశారు. నిన్న విజయవాడలోని జలవనరుల శాఖ కార్యాలయంలో మంత్రితో కలిసి శివనాథ్ సమావేశమయ్యారు. ఈసందర్భంగా జిల్లాలోని జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ముత్యాల, వేదాద్రి, పోలంపల్లి ఎత్తిపోతల పథకం అభివృద్ధికి నిధులు మంజూరు చేసి, ఈ ప్రాంత రైతుల సాగునీటి అవసరాలు తీర్చాలని మంత్రిని కోరారు. అలాగే కంచల, వేదాద్రి ప్రాజెక్టులను అభివృద్ధి చేసి పునః ప్రారంభించాలని, పోలంపల్లి ఆయకట్టుకు శాశ్వతంగా సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కేశినేని శివనాధ్ మంత్రికి వివరించారు.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు, ఆదేశాలను తెలిపే ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వుల జారీ రిజిస్టర్ –జీఓఐఆర్ పోర్టల్ ను మళ్లీ అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ నిన్న ఉత్తర్వులు జారీచేశారు. జీవోఐఆర్ పోర్టల్ పునరుద్ధరించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఐటీ శాఖను ఆదేశించారు. అన్ని శాఖలు ఇక నుంచి జీవో నంబర్లను ఆ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. రేపటి నుంచి ప్రభుత్వం జారీచేసే ప్రతి ప్రభుత్వ ఉత్తర్వు–జీఓనూ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు తెలిపారు.

---------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గా మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో అక్టోబరు 3 నుంచి 12 వరకు దసరా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి కేఎస్ రామారావు ఒక ప్రకటనలో వెల్లడించారు. అక్టోబరు 3న బాలా త్రిపుర సుందరీదేవిగా, 4న గాయత్రీదేవి, 5న అన్నపూర్ణ, 6న లలితా త్రిపుర సుందరీదేవి, 7న మహాచండీదేవి, 8న మహాలక్ష్మీదేవి, 9న సరస్వతీదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దిని, 12న రాజరాజేశ్వరీ దేవిగా అమ్మవారు దర్శనమివ్వనున్నారని తెలిపారు. 3న ప్రారంభమయ్యే దసరా ఉత్సవాలు 12న సాయంత్రం కృష్ణానదిలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు జరిగే హంసవాహన సేవతో పరిసమాప్తమవుతాయని పేర్కొన్నారు.

======================